# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





## -52-

## జలకాలాటలలో.... రెండో కథ

నా అంతటి నేనే తనకి చెప్పిన సలహాని కాగితం మీద వ్రాసే అధికారం ఉన్న మా "గేట్ కీపర్" డాకటేరు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం నేను స్థానిక "జలకాటల కంపెనీ" అనబడని, "అక్వేటిక్ థెరపీ" అనబడే ఒకానొక తాలింఖానాలో చేరాను. దానికి కారణం ఇది వరలో వివరించినట్టు వయసు రీత్యా వెన్నెముకలో బలం కాస్త తగ్గి తద్వారా నడుము, పిక్కలు, తదితర చోట్లా వస్తున్న నొప్పులని నియంత్రించే ప్రక్రియలో ఇది మరొకటి అనమాట.

నేను మొదటి రోజు నీలం పొట్టి లాగూ, బనీను లాంటి చొక్కా కూడా వేసుకుని అక్కడికి వెళ్ళగానే ఒకానొక అతి పల్చగా, అతి పొడుగ్గా 'మూతి ముసుగు' ధరించి ఉన్న ఒక ఆడ పిల్ల నన్ను సాదరంగా ఆహ్వానించి వాళ్ళ 'ఈత కొలను' ..అనగా స్విమ్మింగ్ పూల్ దగ్గరకి తీసుకెళ్ళింది. ఆ స్విమ్మింగ్ పూల్ లో అయినా సముద్రం లో అయినా ఎక్కడ నీట్లో పడేసినా అలా, అలా తేలుతూ పోతుంది కానీ మునిగే ప్రమాదం లేనంత పీలగా ఉంది కాబట్టి ఆ పిల్లకి ముద్దుగా "వెదురు బద్ద" అని పేరు పెట్టుకున్నాను. "హాయ్, అయాం ఖేమ్ చొ" అని తనని పరిచయం చేసుకోగానే మన వడొదరా గుజ్జు బెన్ బాపతు ఏమో అని కొంచెం ఆశ్చర్యం వేసింది. ఆ అమ్మాయే నాకు "శిక్షిణి" అంటే శిక్షణ ఇచ్చే ట్రైనర్ ట. వడోదరా యా కాదా అని తెల్సుకునే లోపుగానే ఆ పిల్ల నన్ను చూసి, ఈత కొలను కేసి చూపించి "అందులో దిగు, దిగు నాగా, దిగరా నాగా" అంది. "యప్" అని నేను అని బుద్ధిగా నీళ్ళ లోకి దిగబోతుంటే "ఆగాగు, కావాలంటే అది విప్పెయ్" అంది వెదురు బద్ద. అసలే అది ఎయిర్ కండిషన్ హాలులో ఉన్న ఈత కొలను కాబట్టి వాతావరణం చలిగానే ఉంది. అంత చలి లోనూ ఆ వెదురు బద్ద "విప్పెయ్' అనే ఆదేశం వినగానే నాకు చెమట్లు పట్టేశాయి. అది చూసి అప్పటికే ఆ ఈత కొలను లో తప తపా కొట్టుకుంటున్న ఇద్దరు ఆడంగులు దంగై పోయి తప, తప మానేసి నా విప్పుడు ప్రక్రియ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నాకు అనుమానం వచ్చి "రెండునా, ఒకటేనా?" అని వెదురుబద్దని అడిగాను. ఆ పిల్ల ఒక క్షణం బెదిరిపోయి, మరుక్షణం కిచ కిచా నవ్వేసి "వెధవ్వేషాలు వెయ్యకు, రాయూ, ఆ బనీను ఒక్కటే తీసెయ్. సిగ్గేస్తే అది కూడా ఉంచుకో" అనేసి పక్కనే తన కోసం వేసిన కుర్చీలో కూలబడింది. అమరికాలో నా పేరు రాయూ అని మరొక సారి

తెలియడమే కాకుండా ఈ వెదురు బద్దది వడోదరా కాదు అని స్పష్టంగా తెలిసిపోయింది. ఆవిడ గుజ్జు బెన్ అయితే మనం రాజు భాయ్ కదా!

ఆమె ఆదేశాలు ఇప్పుడు సరిగ్గా అర్ధం అయి, హమ్మయ్య, అంతే కదా అని నేను ఈత కొలను లో ఉన్న సహ ఈత గత్తెల నిరాశల నిట్టూర్పులని లక్ష్యపెట్టకుండా, ఆ "టీ చొక్కా" ఒక్కటీ తీసేసి ఆ కొలను లో 'దుర్యోధనుడు" మయ సభలో కొలనులోలా అడుగుపెట్టాను కానీ ఢభీమని పడి పోయి ఆ ఇద్దరు ద్రౌపదుల నవ్వులాటకి గురి అవలేదు. అదే కనక జరిగి ఉంటే మరో భారత యుద్ధానికి తెర లేచేదేమో!

ఇక వెదురు బద్ద ఆదేశం ప్రకారం ముందుగా ఒక ఐమూల ఉన్న మెట్టు మీద కూచుని కాళ్ళు రెండూ ముందుకీ, వెనక్కీ ఆడించడం మొదలుపెట్టాను. అది మనం "వేడెక్కడానికి ట"...అంటే వర్క్ ఔట్ ముందు వార్మ్ అప్...అనమాట. ఇలా వేడెక్కిన తర్వాత "లేచి నడు"" అరిచింది వెదురు బద్ద. అప్పటికే ఆ కొలనులో ఉన్న తెల్ల భామ, నల్ల భామా అదే పనిగా అదే పని చేస్తున్నారు..అనగా..వాళ్ళిద్దరూ ఆ స్విమ్మింగ్ పూల్ కి చెరొక పక్కనా ఉన్న పొదుగాటి తళ తళా మెరుస్తున్న స్టైన్ లెస్ స్టీల్ కడ్డీలు పట్టుకుని నడుస్తున్నారు. ఇక నాకు ఆ కడ్డీ దొరికే అవకాశం లేక ఆ కొలను మధ్యలోనే నాలుగడుగులు వేశాను. అంతే...వెంటనే మా చిన్నప్పటి ఫిజిక్స్ టీచర్ తులసీ దేవి గారూ, ఆవిడ నూరిపోసిన ఆర్కిమెడీస్ ప్రిన్సిపుల్ హఠాత్తుగా గుర్తుకొచ్చి, వాళ్ళు చెప్పినట్టుగా 'గాల్లో తేలినట్టుందీ" లాగా కాళ్ళు తేలి ఇటీవల మన అమెరికమ్మాయి బండ్ల శిరీష రోదసి ప్రయాణమూ, ఆ అమ్మాయి భూమ్యాకర్షణ శక్తిని లేని శూన్యం లో ఎలా తేలిపోయిందో రాజా వారికి ఇక్కడే ఈ భూమి మీదనే అనుభవం అయింది. అలా, అలా పక్షి ఈకలాగా తేలిపోడానికి గుండె లోతు నీళ్ళలో దిగితే చాలుగా అనిపించగానే నాకు మిలియన్ల కొద్దీ డాలర్లు ఆదా చేసుకున్న ఫీలింగ్ వచ్చేసి ఆ అమ్మాయీ, తనని రోదసి లోకి వెళ్ళడానికి అయిన ఖర్చు తల్చుకుని జాలి వేసింది.

అన్నట్టు చెప్పడం మర్చిపోయాను...ఆ వెదురు బద్ద ఇందాకా హుంకరించినప్పుడు ఆ మాస్క్ తీసెయ్యడంతో ఆ భామది అసలు సిసలు చైనా నుంచో, పక్కనే ఉన్న వియత్నాం నుంచో దిగుమతి అయింది అని గమనించాను. గట్టు మీద పసుపు, కొలనులో ఒక కడ్డీని పట్టుకుని తెలుపు, మరొక కడ్డీ మీద వేళ్ళడుతూ ఒక నలుపు, నారీ, నారీ నడుమ గోధుమ రంగుల వాడినైన నన్నూ చూసి వర్ణాశ్రమ ధర్మాన్ని సమానంగా పాటించగలిగిన ఈ అమెరికా దేశం మీద మరొక్క సారి అబ్బురపాటు కలిగింది.

ఇంతకీ ఈ నాటి హై టెక్కు తరం వారికి బిల్ గేట్స్, స్టీవ్ జాబ్స్ తెలుసునేమో కానీ ఈ బాయిల్స్ లా కానీ ఆర్కిమెడీస్ ప్రిన్స్ పుల్ గురించి కాస్త వివరణ ఇవ్వాలి. "ఒక వస్తువు ద్రవంలో పూర్తిగా మునిగినపుడు వస్తువుపై కలుగజెయబడిన ఊర్ధ్వ ఒత్తిడి ఆ వస్తువు కోల్పోయిన ద్రవ భారవుతో సమానంగా ఉంటుంది". అనేది ఆర్కిమెడీస్ సిద్ధాంతం. ఇలా తెలుగులో చెప్తే అసలు అర్ధం అవదు కాబట్టి మామూలు భాషలో చెప్పాలీ అంటే మనం నీట్లో మునిగితే

ఆ నీళ్ళు మనల్ని ఒత్తిడితో పైకి తోస్తాయి. అలా పైకి తోయబడడం వలన మనకి బరువు తగ్గినట్టు అనిపించేస్తుంది. నడుం దాకా నీట్లో ఉంటే సగం బరువూ, పీకెల దాకా మునిగితే మూడొంతుల బరువూ తగ్గిపోతాం. ఇంకా లోతుకి వెళ్తే ఒహటే మునుగుడు..గోవిందా, గోవింద అనేసుకోవడమే. అసలు బరువే మాయం అయిపోతుంది కాబట్టి తస్మాత్ జాగ్రత్త అని మా వెదురు బద్ద చెప్పగానే నాకు శిక్షణ ఇవ్వడమే కానీ మనం మునిగిపోతుంటే రక్షణ ఇచ్చే స్తోమత ఆ పిల్లకి లేదు అని అర్ధం అయింది. బరువు తగ్గితే వ్యాయామం సులభం అనేదే ఈ యావత్ ఏక్వా థెరపీ సూత్రం.

ఇంతకీ ఆ నీళ్ళూ మనల్ని కిందకి ఎందుకు తొయ్యవూ, పైకే ఎందుకు తోస్తాయీ అంటే అది మనకి తెలీదు. అలాగే ఏపిల్ పండు కిందకే ఎందుకు పడిందీ, పైకి ఎందుకు పోలేదూ అంటే కూడా నన్ను అడక్కండి. ఆర్కిమెడీస్ నో న్యూటన్ నో అడగండి. లేకపోతే వేదాలు చదవండి. అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష మరి!

మొదటి రోజు "బరువు తగ్గినచో వ్యాయామం హెచ్చును" అనే మూల రహస్యం తెలియగానే రెండో రోజు రాజా వారు రెచ్చిపోయారు. రెండో రోజు మా శిక్షిణి పేరు తాటి బద్ద....అంటే ఈ అమ్మాయి ఎత్తుపల్లాలూ, వైశాల్యం కాస్త ఎక్కువే కానీ నీట్లోకి విసిరేస్తే తేలిపోయే బాపతే...అంటే తెప్ప పడవ లాంటిది అనమాట. ఈ పిల్ల ఆదేశాలతో నా జలకాలాటలలో కడ్డీ పట్టుకునీ, కొనకా మామూలు నడక, పక్కకి నడక, వెనక్కి నడక, నీట్లో వంద గుంజీలు, కాలి మడమ మీదా, వేళ్ళ మీదా నుంచోడం, ..ఒకటేమిటి సుమారు పది రకాల భంగిమలలో ఏకంగా గంట సేపు సునాయాసంగా...అనగా నిజంగానే ఆయాసం లేకుండా, కాళ్ళూ, చేతులూ, నడుమూ, పిక్కలూ ఎక్కడ నొప్పి పెట్టకుండా వ్యాయామం చేసి నాకు నేనే ఆశ్చర్య పోయాను. టీవీల్లో వచ్చే వ్యాయామం ప్రకటనల్లో అందమైన అమ్మాయిలు అంతేసి చెమట్లు ఎందుకు పట్టించుకుంటారో నాకు అర్ధం అవలేదు.

ఈ ఏక్వాటిక్ థెరపీ అనే జలకాటాలలో మరి కొన్ని మూల రహస్యాలు ముచ్చటగా మూడో కథలో....మరొక సారి...అంత వరకూ సహ నొప్పి బాధితులకి ఓమ్ శాంతి, ఓమ్ శాంతి...

**COMMENTS**